క్లుప్తంగా

ఎరువుల కొరత లేకుండా చర్యలు

ఇచ్చోడ: రైతులకు ఖరీఫ్‌లో ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మండల వ్యవసాయాధికారి జాదవ్ కైలాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పలు ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీ నిర్వహించి, రిజిస్టార్‌ను పరిశీలించారు. ఇచ్చోడ, సిరికొండ మండలాల్లో నాలుగు ఫర్టిలైజర్ దుకాణాల్లో ఆన్‌లైన్ ఆఫ్‌లైన్‌లో ఎరువుల విక్రయాల రిజిస్టార్‌లను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందచేస్తున్నట్లు తెలిపారు. అన్ని రకాల ఎరువుల రైతులకు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

పట్టుదలతో చదవాలి

ఇంద్రవెల్లి: విద్యార్థులు పట్టుదలతో చదవాలని హైమన్‌డార్ఫ్ బెట్టి ఎలిజిబెత్ స్మారక గ్రంథాలయ వ్యవస్థాపక అధ్యక్షుడు దుర్వ సంతోష్ అన్నారు. శుక్రవారం మండలంలోని ముత్నూర్ ప్రాథమిక పాఠశాలలో హైమన్ డార్ఫ్ బెట్టి ఎలిజిబెత్ స్మారక గ్రంథాలయం ఆధ్వర్యంలో 120 మంది విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్, పెన్సిల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మెస్రం రవీందర్, ఉపాధ్యాయులు అర్జున్, నాందేవ్, అన్నపూర్ణ, రంగుల రాజు, ఆదిమూలం నరేశ్, గారులే కిరణ్ పాల్గొన్నారు.

వన్‌టౌన్ సీఐగా సునీల్‌కుమార్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ టౌన్ సీఐగా సునీల్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్‌లోని ఏసీబీ కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ జిల్లాకు బదిలీపై వచ్చారు. గతంలో నిర్మల్ జిల్లాలో ఎస్సైగా విధులు నిర్వర్తించారు. కాగా ఆదిలాబాద్ వన్‌టౌన్ సీఐగా పనిచేసిన సత్యనారాయణ ఐజీ కార్యాలయానికి రిపోర్టు చేయాలని మల్టీజోన్–1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐకు వన్‌టౌన్ ఎస్సైలు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

టూటౌన్ ఎస్సైగా విష్ణుప్రకాష్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ టూటౌన్ ఎస్సైగా విష్ణుప్రకాష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల సమయంలో నిజామాబాద్ జిల్లా వన్‌టౌన్ ఎస్సైగా బదిలీపై వెళ్లారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఆయన జిల్లాకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం టూటౌన్ సీఐ కరుణాకర్ రావును మర్యాద పూర్వకంగా కలిశారు.

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోవాలి

బజార్‌హత్నూర్: తపాలా శాఖ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ జిల్లా పోస్టల్ సబ్ డివిజన్ పర్యవేక్షణ అధికారి సందీప్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రజలకు తపాలాశాఖ ప్రవేశపెట్టిన పథకాల గురించి అవగాహన కల్పించారు. చిన్న మొత్తాల పొదుపు పథకాలు, రికవరింగ్ డిపాజిట్, సేవింగ్ అకౌంట్స్, పీపీఎఫ్ అకౌంట్స్, టీడీ అకౌంట్స్‌లలో చిన్న పెట్టుబడితో అధిక వడ్డీ అందిస్తుందన్నారు. జీవిత బీమా, ప్రమాద బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, జల్కే పాండురంగ్, ఉత్తం, భోజన్న, నరేశ్ పాల్గొన్నారు.

బదిలీలు సహజం

తలమడుగు: ప్రభుత్వ ఉద్యోగంలో బదిలీలు సహజమని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో బదిలీపై వెళ్తున్న సిబ్బందిని సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగాలలో విధి నిర్వహణలో భాగంగా బదిలీలు సహజమని అన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సుధీర్ రెడ్డి, సూపరింటెండెంట్ శంకర్, వైద్యాధికారి దూద్‌రాం రాథోడ్, గ్రామపంచాయతీ కార్యదర్శి వినోద్, శివకుమార్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

బీసీ'ఏ' సాధన కోసం సీఎంను కలుస్తాం

ఎదులాపురం: బీసీఏ సాధన కోసం త్వరలో సీఎంను కలుస్తామని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొజ్జ నారాయణ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును తాము స్వాగతిస్తున్నామని, అదేవిధంగా 2022లో ముదిరాజ్‌లను బీసీఏలో చేర్చాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్‌ఎల్‌సి ఆర్డర్‌ను బీసీ కమిషన్ యధావిధిగా అమలు చేయాలని కోరారు. నాయకులు సలేందర్, శివయ్య, దారవేణి రాము, దార్ల రవి, బొజ్జ సంతోష్, చిన్నయ్య, బొజ్జ గంగన్న పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

నార్నూర్: వర్షాకాలంలో పరిసరాల పరిశుభ్రతను ప్రతిఒక్కరూ పాటించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని పూసిగూడ, జాండా గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. వేడి చేసి చల్లార్చిన నీటినే తా గాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ చౌహన్ చరణ్ దాస్, హెల్త్ అసిస్టెంట్ కైలాస్, చౌహన్ సింధు, సుజాత, రత్నాబాయి, రూప్‌దేవ్, దుర్గు పటేల్ పాల్గొన్నారు

మండలాల ప్రకటనకు ఏడాది

- ఇంకా కానరాని స్పష్టత
- ప్రభుత్వం మారడంతో డైలమాలో కొత్త మండలాల ఏర్పాటు



సంబురాలు జరుపుకుంటున్న బీఆర్‌ఎస్ నాయకులు (ఫైల్)

జైనథ్: గత బీఆర్‌ఎస్ హయాంలో జైనథ్ మండలాన్ని మూడు మండలాలు విభజిస్తూ, ప్రభుత్వం జీవో విడుదల చేసింది. గత ఏడాది ఆగస్టులో దీనిపై ప్రత్యేకంగా ప్రజల నుంచి అభ్యంతరాలను సైతం స్వీకరించింది. దీంతో పాత మండలం జైనథ్‌తో పాటు సాత్నాల, భోరజ్ మండలాల ఏర్పాటు లాంఛనమే అని అనుకున్నారు. ఆయా గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు అప్పట్లో స్వీట్లు పంచిపెట్టి, టపాసులు పేల్చి సంబురాలు జరుపుకున్నారు. అంతలో ఎన్నికల షెడ్యూల్ రావడంతో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడంతో గత సంవత్సర కాలంగా కొత్త మండలాలపై స్పష్టత కరువైంది. దీంతో అసలు కొత్త మండలాలు ఏర్పాటు అవుతాయా? జైనథ్ మండలమే కొనసాగుతుందా? అనే అయోమయంలో మండల వాసులు ఉన్నారు.

గత ఏడాది జీవో..

విస్తీర్ణం దృష్ట్యా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే అతి పెద్ద మండలమైన జైనథ్‌లో మరో రెండు మండలాల ఏర్పాటుకు గత ప్రభుత్వం ఆగస్టులో రంగం సిద్ధం చేసింది. అప్పటి ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ ఈమేరకు జీవో విడుదల చేశారు. 55 రెవెన్యూ గ్రామాలు, 42 గ్రామ పంచాయతీలు కలిగిన జైనథ్ మండలం విస్తీర్ణం దృష్ట్యా, జనాభా దృష్ట్యా పెద్దదిగా ఉండడంతో కొత్త మండలాల ఏర్పాటుకు పలు గ్రామాల ప్రజలు ఐదు సంవత్సరాల నుంచి పట్టుబట్టారు. పలుమార్లు అప్పటి ఎమ్మెల్యే జోగు రామన్నకు వినతిపత్రాలు అందజేశారు. దీంతో మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న సాత్నాల, భోరజ్ మండలాల ఏర్పాటు గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగింది.



జైనథ్ మండల మ్యాప్

సంబురాలు జరుపుకున్న ప్రజలు..

కొత్త మండలాల ఏర్పాటుకు ప్రభుత్వం జీవో విడుదల చేయడంతో అప్పట్లో మండలవాసులు సంబురాలు జరుపుకున్నారు. ఏళ్లుగా మండలవాసులు ఎదురు చూస్తున్న కొత్త మండలాల ఏర్పాటు జీవో రావడంతో రాజకీయ నాయకులు, సామాన్య ప్రజలు సైతం హర్షంవ్యక్తం చేశారు. కొత్త మండలాల ఏర్పాటు పూర్తి అయితే పరిపాలన సౌలభ్యంతో పాటు రాజకీయ నిరుద్యోగులకు సైతం కొత్త అవకాశాలు వస్తాయని అంతా అనుకున్నారు. అప్పట్లో 15 రోజుల పాటు జిల్లా కలెక్టర్ అభ్యంతరాలు స్వీకరించడం, ప్రభుత్వానికి విన్నవించడంతో మండలాల ఏర్పాటు లాంఛనమేనని అధికార, రాజకీయ వర్గాలు అనుకున్నాయి. కానీ ప్రస్తుతం ఈవిషయమై ఎలాంటి కదలిక లేకపోవడంతో ప్రజలు సందిగ్ధంలో ఉన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

నేరడిగొండ: తల్లిపాలు అమృతంతో సమానమని, తల్లిపాలు శ్రేయస్కరమని ఎంపీడీవో రాజ్‌వీర్, ఎంపీవో లక్ష్మణ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శుక్రవారం మండల మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి తల్లిపాల ఆవశ్యకత గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: తల్లిపాలే శ్రేయస్కరమని కేస్లాపూర్ అంగన్‌వాడీ కమల అన్నారు. శుక్రవారం మండలంలోని కేస్లాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. పుట్టిన గంటలోపే బిడ్డకు తల్లిపాలు పట్టించాలన్నారు. కార్యక్రమంలో పిట్టబొంగరం పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ గంగమ్మ, ఏఎన్‌ఎం సునీత, గర్భిణులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో రాజ్‌వీర్

సీఎం రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం

కైలాస్‌నగర్: తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులకు పీఆర్సీని వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంపై కళాకారులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు సీతక్క, జూపల్లి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు చిత్రపటాలతో కూడిన ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. గత ప్రభుత్వం సాంస్కృతిక సారథి కళాకారులకు రూ.24వేల వేతనం మాత్రమే చెల్లించేదన్నారు. కాంగ్రెస్ సర్కార్ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు అందించాలని నిర్ణయించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో సారథి కళాకారులు పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న కళాకారులు

పశువైద్యాధికారిగా రాథోడ్ జీవన్

నేరడిగొండ: సాధారణ బదిలీల్లో భాగంగా నేరడిగొండ ప్రభుత్వ పశువైద్యశాల అధికారిగా రాథోడ్ జీవన్ నియామకం అయ్యారు. ఈసందర్భంగా ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వెటర్నరి అసిస్టెంట్‌గా పనిచేసిన అనిత నిర్మల్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో నిర్మల్ నుంచి వెటర్నరి అసిస్టెంట్‌గా నరేందర్ బదిలీపై వచ్చారు. తర్నం గ్రామంలోని పశువైద్యశాలలో డిప్యూటేషన్‌పై పనిచేసిన విజయలక్ష్మి నిర్మల్ జిల్లాకు బదిలీ కాగా, ఆమె స్థానంలో నిర్మల్ నుంచి వెంకన్న తర్నం పశువైద్యశాలకు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు వాంకిడి పశువైద్యాధికారి సుశీల్ కుమార్ నేరడిగొండ మండల పశువైద్యాధికారిగా అదనపు బాధ్యతలు చేపట్టారు. రాథోడ్ జీవన్ బాధ్యతలు చేపట్టడంతో సిబ్బంది ఆయనను శాలువాతో సత్కరించారు.



సన్మానిస్తున్న పశువైద్య సిబ్బంది

ఆదివాసీ దినోత్సవాన్ని పండుగలా జరుపుకోవాలి

నార్నూర్: ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ప్రతీ గుడాలలో, మండల కేంద్రాల్లో పండుగ వాతావరణంలో జరుపుకోవాలని ఆదివాసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని కుమురం భీం విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆగస్టు 9న రాష్ట్రపతి భవన్ హైదరాబాద్‌లో నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమానికి తరలివెళ్లి విజయవంతం చేయాలన్నారు. ఆదివాసీ గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు పెందూర్ దాదిరావు, శ్రీరాం, పెందుర్ విట్టల్, మెస్త్రం మాణిక్ రావు, కుర్సింగా నగేశ్, పూసం ఈశ్రు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు

కృతజ్ఞత సభకు తరలివెళ్లిన టీచర్లు

ఆదిలాబాద్‌టౌన్: పదోన్నతి పొందిన ఉపాధ్యాయులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన కృతజ్ఞత సభకు ఉపాధ్యాయులు తరలివెళ్లారు. శుక్రవారం జిల్లా కేంద్రం నుంచి ప్రత్యేక వాహనాల్లో బయల్దేరి వెళ్లారు. టీచర్లు బయల్దేరి వెళ్తున్న బస్సుకు డీఈవో ప్రణీత జెండా ఊపి ప్రారంభించారు. తరలివెళ్లిన వారిలో టీయూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరాం, సెక్టోరియల్ అధికారి శ్రీకాంత్, డీఈవో సీసీ రాజేశ్వర్ ఉన్నారు.

బోథ్: ఇటీవల పదోన్నతి పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఆత్మీయ సభకు శుక్రవారం బస్సులో తరలివెళ్లారు. ఆత్మీయ సభకు వెళ్లిన వారిలో మండల విద్యాధికారి భూమారెడ్డి, నోడల్ అధికారి ఈదవు పోశెట్టి, కోఆర్డినేటర్ కుమ్మరి పోశెట్టి, ఉపాధ్యాయులు ఉన్నారు.



తరలివెళ్తున్న ఉపాధ్యాయులు

అర్హులందరికీ రుణమాఫీ

జైనథ్: అర్హులైన ప్రతీ ఒక్క కుటుంబానికి రూ. 2లక్షల రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మండల వ్యవసాయాధికారి వివేక్ అన్నారు. శుక్రవారం గిమ్మ గ్రామంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర అధికారులతో సమావేశమయ్యారు. లక్ష వరకు 2049 మందికి, లక్ష యాభై వేల వరకు 1658 మంది రైతులకు రుణమాఫీ వర్తించిందన్నారు. కొన్ని బ్యాంకుల ద్వారా రైతుల సమాచారం సరిగా అందకపోవడంతో రుణమాఫీ కాలేదన్నారు. రుణమాఫీ కానీ రైతుల జాబితాను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు పంపిస్తున్నామన్నారు. ఎవరూ కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.



బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న ఏవో వివేక్

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ ఆసిఫుల్లా

తాంసి: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఐటీ కోర్ డీఎస్పీ ఆసిఫుల్లా విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్టాక్ పెట్టుబడి మోసం, రైతుల రుణమాఫీ నకిలీ కాల్స్, డ్రగ్ సరఫరా, పార్ట్‌టైమ్ జాబ్ మోసాల గురించి వివరించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. సైబర్ నేరం బారిన పడితే వెంటనే 1930 కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్, తాంసి ఎస్సై శివరాం, షీ టీం బృందం సుశీల, సత్య మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవోకు సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల ఎంఈవోగా పనిచేస్తూ ఆదిలాబాద్ జిల్లాకు బదిలీపై వచ్చిన డి.సోమయ్యను బాల్యమిత్రులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ప్రమోద్ కుమార్ ఖత్రి, ఏఎస్సై గంజీవార్ పోశెట్టి, బిర్కుర్వార్ నగేశ్, నరేశ్‌రెడ్డి, వెంకటి, విలాస్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు

బోథ్: గ్రామ పంచాయతీల్లో పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ శుక్రవారం రాష్ట్ర సర్పంచులు అసెంబ్లీని ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో బోథ్ మండలం నుంచి ఎవరూ వెళ్లకుండా మండలంలో పలువురు మాజీ సర్పంచ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు బందారి శ్రీధర్ రెడ్డిని ఉదయం అదుపులోకి తీసుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఘనంగా గోరింటాకు పండుగ

బోథ్: మండల కేంద్రంలోని శ్రీసరస్వతి శిశు మందిర్‌లో శుక్రవారం బాలిక విద్యలో భాగంగా ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని గోరింటాకు పండుగను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు తమ చేతులకు గోరింటాకు పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజేందర్ గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాటిన ప్రతీ మొక్కను రక్షిద్దాం



మొక్కలు నాటిస్తున్న అధికారులు



మట్లాడుతున్న ప్రత్యేకాధికారి పుల్లయ్య

ఇంద్రవెల్లి: వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా నాటిన ప్రతీ మొక్కను రక్షిద్దామని ఈజీఎస్ ఏపీవో జాదవ్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని హీరాపూర్, ఏమాయికుంట గ్రామపంచాయతీ పరిధిలోని నిర్వహించిన వనమహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రతీ గ్రామంలో ప్రభుత్వ స్థలంలో, ప్రభుత్వ కార్యాలయాల పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటి రక్షించాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ సుందర్‌సింగ్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: పర్యావరణ సమతుల్యం కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని ఆదిలాబాద్‌అర్బన్ ఎంఈవో డి.సోమయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని లిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో తెలంగాణ నేషనల్ గ్రీన్ క్రాఫ్ ఆధ్వర్యంలో పర్యావరణంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవేందర్ పటాస్కర్, సెక్టోరియల్ అధికారి నారాయణ, నేషనల్ గ్రీన్ క్రాఫ్ కోఆర్డినేటర్ విద్యాసాగర్, నర్సయ్య, పొచ్చరెడ్డి పాల్గొన్నారు.

ఇచ్చోడ: ఈనెల 5 నుంచి 9వరకు చేపట్టే పచ్చదనం .. స్వచ్ఛదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా వ్యవసాయాయ అధికారి పుల్లయ్య అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో పాటు మండలస్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నేటి నుంచి గ్రామస్థాయిలో గ్రామసభలు నిర్వహించి సమస్యలను గుర్తించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో లక్ష్మణ్, ఎంపీవో రమేశ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జైపాల్, పశువైద్యాధికారి గోవింద్‌నాయక్, ఈజీఎస్ ఏపీవో నరేందర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బోథ్: రోజురోజుకూ పెరుగుతున్న భూతాపాన్ని తగ్గించేందుకు ప్రతిఒక్కరూ నడుంబిగించాలని సామాజిక సేవకుడు జక్కుల వెంకటేశ్ అన్నారు. స్థానిక కస్తూరిబా పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ వలిత, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు

30 ఏళ్ల కల నెరవేరింది

- ఎమ్మార్పీఎస్ నాయకుల హర్షం
- మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం

గుడిహత్నూర్: 30 ఏళ్ల ఉద్యమ కల నెరవేరిందని మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బడుగు గంగయ్య, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కళ్లెపల్లి ప్రేంరాజ్ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో హర్షం వ్యక్తం చేశారు. బస్టాండ్ వద్ద మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, టపాకాయలు పేల్చి సంబురాలు జరుపుకున్నారు. రామంచల లక్ష్మణ్, గాయ్‌కాంబ్లే బాలాజీ, సుధాకర్, భూమన్న, కనకయ్య, రమేశ్, రవి, సత్యనారాయణ, సురేశ్, కళ్లెపెల్లి దేవేందర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: ఎమ్మార్పీఎస్ వ్యవస్థపకులు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి శుక్రవారం మండలంలోని ముత్నూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాంబ్లే బాలాజీ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు లింగంపల్లి గోవింద్, భీంరావ్‌మాంగ్, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మకమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కుడాల స్వామి, గజ్జెల శంకర్‌లు అన్నారు. ఎస్సీ వర్గీకరణపై దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును హరిస్తూ శుక్రవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గజ్జెల అశోక్, గోనె అడెల్లు పాల్గొన్నారు.

బోథ్: ఎస్సీ వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై హర్షంవ్యక్తం చేస్తూ శుక్రవారం సొనాల గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రధాని మోదీ, మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు బీజేపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, అశోక్, మానాల శేఖర్, దినేష్, సంతోష్, లంక లలిత, కిష్టయ్య, రాజు, సుభాష్ సూర్య, బొర్రె రవీందర్, హరీష్, రంజిత్, పోతన్న, రాజేశ్వర్ పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న దళిత నాయకులు

సంక్షిప్త వార్తలు

సీపీఆర్‌పై అవగాహన

బోథ్: సొనాల గ్రామంలోని ఉషోదయ పాఠశాలలో గ్రామానికి చెందిన రాజ్ కుమార్ విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. అలాగే పిడుగుపాటు, మొక్కల సంరక్షణ గురించి విద్యార్థులకు వివరించారు. ప్రధానోపాధ్యాయులు ఇర్ల గంగాధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏజీపీని సన్మానించిన రిటైర్డ్ జడ్జి

బోథ్: బోథ్ జూనియర్ సివిల్ కోర్టులో ఏజీపీగా నియమితులైన పంద్రం శంకర్‌ను రిటైర్డ్ జడ్జి శ్యాంమోహన్ రావు శుక్రవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బోథ్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వామన్ రావ్ దేశ్‌పాండే, న్యాయవాదులు ఠాకూర్ రూపేందర్, హరీష్ కుమార్, కుమ్మరి విజయ్, ధమ్మపాల్ పాల్గొన్నారు.

అధ్యాపకులకు సన్మానం..

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేసి, బదిలీ అయిన కళాశాల ప్రిన్సిపాల్ ధన్‌రాజ్‌తో పాటు అధ్యాపకులు రాథోడ్ శ్రావణ్, శ్రీనివాస్, బోధనేతర సిబ్బంది మల్లేశం, శంకర్, సుగుందాబాయిలను అధ్యాపకులు, విద్యార్థులు శుక్రవారం ఘనంగా సన్మానించారు.

ఇన్‌చార్జి డీడీకి సన్మానం

ఉట్నూర్‌రూరల్: గిరిజన సంక్షేమ శాఖ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఐటీడీఏ ఇన్‌చార్జి డీడీగా బాధ్యతలు చేపట్టిన వసంత్‌రావును ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. షౌకత్ హుసేన్, నారాయణ, శ్రీనివాస్, బొజ్జు, భగవంత్‌రావు, నితిన్, కమలాబాయి, రాందాస్ పాల్గొన్నారు.

కార్యదర్శికి సన్మానం..

బోథ్: మండలంలోని సోనాల గ్రామపంచాయతీ పంచాయతీ కార్యదర్శిగా పది సంవత్సరాలుగా విధులు నిర్వర్తించి, ఇటీవల బదిలీ అయిన స్వామిని మాజీ సర్పంచ్ చెట్టుపల్లి సదానందం, మాజీ పాలకవర్గ సభ్యులు గ్రామస్తులు శుక్రవారం సన్మానించారు.

'సీఎంను విమర్శించే అర్హత లేదు'

బోథ్: బీఆర్‌ఎస్ నాయకులకు సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించే అర్హత లేదని మాజీ ఎంపీటీసీ రజియా బేగం, నాయకులు షేక్ నాజర్ అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నీచ

ఎంపీడీవోగా బాధ్యతల స్వీకరణ

బోథ్: బోథ్ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా జీవన్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బోథ్ మండల పరిషత్ కార్యాలయంలో మండల పంచాయతీ అధికారిగా ఉన్న ఆయనకు బోథ్ ఎంపీడీవోగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయనకు సిబ్బంది,పంచాయతీ కార్యదర్శులు శుభాకాంక్షలు తెలిపారు.

టార్పాలిన్లు అందజేత

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామంలో బీఆర్‌ఎస్ బీసీ సెల్ అధ్యక్షుడు భీమ బుచ్చన్న గ్రామంలోని పేదవారికి టార్పాలిన్లు అందజేశారు. వర్షాకాలంలో ఇళ్లు పైకప్పు నుంచి ఊరుస్తుండంతో టార్పాలిన్లు అందించినట్లు తెలిపారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మూడో విడత ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 2 నుంచి 12 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. 14 సంవత్సరాలు నిండినవారు, పదో తరగతి, 8వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. వివరాలకు 94935 35378 సంప్రదించాలన్నారు.

ఆర్థిక సాయం

ఇచ్చోడ: బజార్‌హత్నూర్ మండలంలోని ఏసాపూర్ గ్రామానికి చెందిన మాడావి విజయ్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో గోల్డెన్ లీఫ్ స్కూల్ కరస్పాండెంట్ రాథోడ్ మౌనిక శుక్రవారం రూ. ఐదువేల ఆర్థిక సాయం చేశారు.

డిగ్రీ కళాశాలను సందర్శించిన సుబేదార్ మేజర్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలను ఎన్‌సీసీ సుబేదార్ మేనేజర్ భగీరథ్ రామ్ శుక్రవారం సందర్శించారు. నూతనంగా వచ్చిన ఆయన కళాశాలలోని ఎన్‌సీసీ యూనిట్‌ను పరిశీలించారు. ఎన్‌సీసీ ద్వారా క్రమశిక్షణ కలిగి ఉంటారని పేర్కొన్నారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ అతీఖ్ బేగం, ఎన్‌సీసీ కేర్ చంద్రకాంత్ పాల్గొన్నారు.